

శ్రీమందిరం ఆదాయం

నగదు: రూ.6,03,216
బంగారం: 61 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి: 13 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు

కొరాపుట్ జిల్లా సునాబెడ మున్సిపాలిటీతోపాటు నందపూర్ సమితిలో బుద్ధజయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.

- 8లో



సంక్షేమ పథకాలపై శిక్షణ

జయపురం చైల్డ్ ఫండ్ విభాగం ద్వారా లీడ్ మదర్ మహిళలకు స్థానిక పంచాయతీ సమితి కార్యాలయ సభాగృహంలో శిక్షణ శిబిరం నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

విద్యుదాఘాతంతో యువతి మృతి



ఆస్పత్రిలో లక్ష్మీగాడొ మృతదేహం

రాయగడ: విద్యుదాఘాతంతో యువతి ప్రాణాలు కోల్పోయింది. మృతురాలిని జిల్లాలోని కొలనార సమితి సూరి పంచాయతీ పరిధి మునిసింగి గ్రామానికి చెందిన భాస్కర గొడొ కూతురు లక్ష్మీగాడొ (27)గా గుర్తించారు. శుక్రవారం ఉయదం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి చందిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీగాడొ తన ఇంట్లో బట్టలను ఇస్త్రీ చేస్తుండగా ఇస్త్రీ పెట్టెకు గల విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురైంది. దీంతో కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ పనులపై అసంతృప్తి



మాట్లాడుతున్న శంకరరావు

జయపురం: సబ్ డివిజన్‌లోని కొట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్(ఎన్.ఎ.సి) పరిధిలో దమయంతి సాగర్, దేవానిముండ చెరువుల పునరుద్ధరణ పనులపై కొట్‌పాడ్ ఎన్.ఎ.సి. చైర్మన్ ఎం.శంకరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.20 కోట్లతో పనులు ప్రారంభమైనా సక్రమంగా జరగడం లేదని చెప్పారు. ప్రణాళిక లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని, ఈ విషయమై ఇటీవల కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న సంఘు సభ్యులు

రాయగడ: రక్తదానం చేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని స్థానిక బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్ అన్నారు. రాయగడ రక్తదాతల సంఘం ఐదో వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తనిధి కేంద్రంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినవారిమి అవుతామన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను విడనాడాలన్నారు. సంఘం అధ్యక్షులు విజయ్ చౌలెట్, కార్యదర్శి అజయ్ అగ్రాని, డాక్టర్ అబ్దుల్ కలామ్ బ్లడ్ డొనేషన్ వ్యవస్థాపక సంఘం రాయగడ శాఖ అధ్యక్షుడు బి.రాజేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

చైల్డ్‌లైన్‌కు చిన్నారుల అప్పగింత



చైల్డ్‌లైన్ అధికారులతో చిన్నారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియ సమితి నీలిగూడ పంచాయతికి చెందిన 3 ఏళ్ల సుభద్రను జిల్లా న్యాయ సలహా కార్యాలయం వారు బాలిక రక్షణార్థం జిల్లా చైల్డ్‌లైన్ కార్యాలయానికి శుక్రవారం అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. సుభద్ర తన తమ్ముడు బాబులితో కలిసి నీలిగూడ గ్రామంలో నివసిస్తుంది. వీరి తల్లి దండ్రులు చనిపోవడంతో సుభద్ర చదువు మానేసి తమ్ముడి కోసం ఇప్పపువ్వ ఏరడం, బీడీ ఆకులు అమ్మి వాటితో వచ్చిన డబ్బులతో తమ పొట్ట నింపుకుంటున్నారు. ఈ విషయం జిల్లా న్యాయ సలహా కార్యాలయం నాయ్యవాది అశోక్ కుమార్ పట్నాయక్‌కు ఈ విషయం తెలియడంతో ఇద్దరినీ వారి కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఈ చిన్నారులను జిల్లా శిశు సంరక్షణ కార్యాలయానికి అప్పగించారు.

మూడో విడత పోలింగ్ నేడే

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 94,48,553 మంది ఓటర్లు
- భువనేశ్వర్ యూపీడీలో ఓటింగ్‌కు సమర్థవంతమైన వ్యవస్థ



హోమ్ ఓటింగ్‌లో పాల్గొన్న వృద్ధుడు



భువనేశ్వర్: భువనేశ్వర్ అర్బన్ పోలీస్ డిస్ట్రిక్ట్ (యూపీడీ)లో 3వ దశ ఎన్నికల పోలింగు శనివారం జరగనుంది. యూపీడీ పరిధిలో పోలింగు కోసం 1,132 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంగణాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా యూపీడీ సమర్థవంతమైన పోలీసు వ్యవస్థని ప్రవేశ పెడుతున్నట్లు డీసీపీ తెలిపారు. 51 మొబైల్ పెట్రోలింగ్ పార్టీలతో 3,000 మంది పోలీసులను మోహరిస్తున్నట్లు వివరించారు. భువనేశ్వర్ కమిషనరేట్ పోలీస్, ఒడిశా స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఒస్కాక్) పోలీస్ పెట్రోలింగ్, బూత్ మానిటరింగ్ సిస్టమ్ (పీపీబీఎంఎస్), వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్ (వీటీఎస్) రెండు మొబైల్ అప్లికేషన్లను అభివృద్ధి చేశాయి. ఈ అప్లికేషన్ ద్వారా పోలింగ్ సమయంలో పెట్రోలింగ్ యూనిట్ల స్థానాన్ని పర్యవేక్షించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అవసరమైన ప్రదేశానికి పంపవచ్చు.

అంతేకాకుండా, ఈ అప్లికేషన్ ద్వారా, బూత్‌లో మోహరించిన సిబ్బంది నేరుగా బూత్ ప్రస్తుత స్థితి, పోలింగ్ స్థితి, క్యూలో వేచి ఉన్న ఓటర్ల సంఖ్య, అంతరాయం కలిగితే, వారు వెంటనే పూర్తి సమాచారాన్ని ఫోటోలు, వీడియోలతో తక్షణమే సమాచారం అందించగలిగే సదుపాయం కల్పించారు. మొబైల్ పార్టీలు పెట్రోలింగ్ చేయడానికి రూట్‌లు ముందే నిర్దేశించారు. ఆ మార్గంలో ఏదైనా మార్పు ఉంటే కంట్రోల్ రూమ్‌లోని డ్యాష్ బోర్డ్‌లో ఆఫ్-రూట్ హెచ్చరికను సూచిస్తుంది.

94,48,553 మంది ఓటర్లు..

- ఈ విడత పోలింగులో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పోటీ చేస్తున్నారు. 42 అసెంబ్లీ స్థానాలకు 383 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వీరిలో 339 మంది పురుషులు, 44 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. 6 పార్లమెంటరీ నియోజకవర్గాలకు 64 మంది ఎంపీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో 55 మంది పురుష అభ్యర్థులు, 9 మంది మహిళా అభ్యర్థులు ఆరు లోక్‌సభ నియోజకవర్గాలకు పోటీలో ఉన్నారని సీఈవో వివరించారు.
- రాష్ట్రంలో 94,48,553 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 48.30 లక్షల మంది పురుషులు, 46.18 లక్షలు మహిళలు ఉన్నారు.
- 10,551 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ఏర్పాట్లు చేశారు. వీటిలో దాదాపు 200 ఆదర్శ పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. 2,000 పోలింగ్ స్టేషన్లు కీలకమైనవిగా గుర్తించారు.
- మహిళా పోలింగ్ సిబ్బంది ప్రత్యక్ష పర్యవేక్షణలో 1,500 పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగుల పర్యవేక్షణలో 30 పోలింగ్ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఎన్నికల నిర్వహణకు 70 వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించనున్నట్లు సీఈఓ తెలిపారు. దేవ్‌గడ్‌లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగు జరుగుతుందని, మిగిలిన అన్ని స్థానాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.


హోమ్ ఓటింగ్..

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాల ప్రకారం బాలాసోర్ పార్లమెంటరీ నియోజక వర్గంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ ప్రక్రియలో 85 ఏళ్లు పైబడిప వయో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద ఓటు వేసే సౌకర్యం కల్పిస్తున్నారు. అన్ని వర్గాల ఓటర్లు పోలింగు అత్యధిక సంఖ్యలో పాల్గొనేందుకు ప్రోత్సహించే దిశలో ఈసీఐ ఈ కార్యక్రమం చేపట్టింది.

• గాలివాన బీభత్సం



ఇంటిపై కూలిన చెట్టు



ఎగిరిపోయిన ఇంటివద్ద బాధితుడు



రేకులు ఎగిరిపోయిన ఇల్లు

- భయాందోళన చెందిన ప్రజలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. భీకర గాలులతో జనం భయాందోళనకు గురయ్యారు. చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడ్డాయి. రేకు, పూరిళ్లు ఎగిరిపోవడంతో జనం రోడ్డున పడ్డారు. చిత్రకొండ సమితి స్వభీమాన్ ఏరియా గాజుల్ మామ్ముడి, తటగూఢ గ్రామాల్లో పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. ప్రభుత్వం కల్పించుకొని పరిహారం ఇప్పించాలని బాధితులు కోరారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కాపలా



స్ట్రాంగ్ రూమ్ వద్ద కాపలాగా ఉన్న ఎమ్మెల్యే దాశరథి గొమాంగో తదితరులు

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచిన విషయం తెలిసిందే. దీంతో కళాశాల స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినా, వివిధ పార్టీల అభ్యర్థులు తమ అనుచరులతో రాత్రివేళలో కాపలా ఉంటున్నారు. మోహనా నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, బీజేపీ అభ్యర్థి (మోహనా) ప్రశాంత్ మల్లిక్‌తో పాటు పర్లాఖెముండి నియోజికవర్గ కాంగ్రెస్, బీజేపీ నాయకులు స్ట్రాంగ్ రూమ్ బయట కాపలా కాస్తున్నారు. ఓట్ల లెక్కింపు వచ్చే 4న జరగనున్న దృష్ట్యా అధికార పార్టీపై అనుమానంతో కాపలాగా ఉంటున్నామని అభ్యర్థులు అంటున్నారు.

శరవేగంగా రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు



రైల్వేస్టేషన్‌లో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. స్టేషన్ ప్లాట్‌ఫారం ఎత్తు, టికెట్ కౌంటర్, రెస్ట్ షెడ్, వాష్ రూమ్, ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వంటి పనుల వల్ల పర్లాకిమిడి మీదుగా పూరీ, భువనేశ్వర్, విశాఖపట్నం వెళ్లే పలు రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. దీంతో ఈనెల 28 వరకు పలు రైళ్లు పలాస నుంచి తిరిగి వెళ్లనున్నాయి. పర్లాకిమిడిలో ట్రైన్లు ఆగుతుంటే ప్రయాణికులు బయటకు వెళ్లడానికి పలు సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ప్రయాణికుల సౌకర్యార్థం రీ షెడ్యూల్ చేశారు.



స్టేషన్‌లో పనులు జరుగుతున్న దృశ్యం

పకోడి కోసం మారాం

- కోపంతో కుమార్తెను కొట్టి చంపిన తల్లి
- హోల్డి గ్రామంలో విషాదం



మృతురాలు లఖిధర్ మజ్జి (ఫైల్)



నిందితురాలు త్రివేణి మజ్జి

కొరాపుట్: పకోడి కోసం మారాం చేసిన కుమార్తెను తల్లి బలంగా కొట్టడంతో ఆ చిన్నారి మృత్యువాత పడింది. ఈ విషాద ఘటన నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి హోల్డి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లఖిరాం మజ్జి, త్రివేణి మజ్జిల కుమార్తె లఖిధర్ మజ్జి (9) చందాహండి సమితి ధర్మల్ ఆశ్రమ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. వేసవి సెలవులకు ఇంటికి వచ్చింది. తల్లి త్రివేణి తన ముగ్గురు పిల్లలకు పకోడి తెచ్చి ఇచ్చింది. అయితే లఖిధర్ తనకు ఎక్కువ పకోడి కావాలని మారాం చేసింది. దాంతో ఆగ్రహించిన తల్లి అక్కడే ఉన్న వెదురు కర్రతో లఖిధర్ తలపై బలంగా కొట్టింది. ఆ దెబ్బకు లఖిధర్ అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఇంటి వెనుక నాళాలో లఖిధర్ మృతదేహం పడేసి డీజిల్ వేసి దగ్ధం చేసింది. అనంతరం తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులను నమ్మించింది. విషయం తెలుసుకున్న రాయిఘర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. చిన్నారి ఆత్మహత్యపై అనుమానంతో దర్యాప్తు చేయగా జరిగిన విషయం త్రివేణి అంగీకరించింది. అనంతరం పోలీసులుత్రివేణిని అరెస్ట్ చేశారు.

చురుగ్గా రథాల తయారీ



రథానికి చక్రాలు తయారు చేస్తున్న వడ్రంగులు

జయపురం: జూలై 7న జరగనున్న జగన్నాథుని రథయాత్రకు సంబంధించి రథాలు సిద్ధమవుతున్నాయి. జయపురం దేవాదాయ ధర్మాదాయ విభాగం ఆధ్వర్యంలో స్థానిక రఘునాథ్ మందిర ప్రాంగణంలో 8 మంది వడ్రంగులు నూతన రథ నిర్మాణం చేస్తున్నారు. జయపురం పట్టణంలో రెండు రథాలు రథయాత్రలో పాల్గొంటాయి. పెద్ద రథం శ్రీజగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర ప్రతిమల కోసం నిర్మిస్తున్నారు.

ఘనంగా ధ్యాన మందిర వార్షికోత్సవం



వార్షికోత్సవంలో శ్రీచైతన్య రాంజీ, భక్తులు

రాయగడ: జిల్లాలోని సదరు సమితి కొత్తపేట పంచాయతీ సింఘనాపూర్‌లో గత ఏడాది నిర్మించిన సీతారామ ధ్యాన మందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీచైతన్యరాంజీ ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవాల్లో కొత్తపేట, జేకేపూర్, ఇరుకుబడి, పితామహాల్ పంచాయతీల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేష నామార్చన, కుంకుమ, అభిషేక తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సంకీర్తనలు, భజన కార్యక్రమాలతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఎక్సైజ్ అధికారుల ముమ్మర దాడులు



సవురాగుడ గ్రామ శివార్లలో సారా బట్టీలపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

- 2,400 లీటర్ల ఇప్ప ఊట ధ్వంసం
- 750 లీటర్ల నాటుసారా ధ్వంసం

జయపురం: నాటుసారా తయారీ కేంద్రాలపై అబ్కారీశాఖాధికారులు శుక్రవారం ముమ్మరంగా దాడులు చేశారు. నవరంగపూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమళ లోచన మిశ్ర, జిల్లా అబ్కారీ శాఖాధికారి అభిరాం బెహరల ఆదేశాల మేరకు.. నవరంగపూర్ అబ్కారీశాఖ విభాగ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ రథ్ పర్యవేక్షణలో నవరంగపూర్ అబ్కారీ స్టేషన్ అధికారి సుజిత్ నాగ్ తన సిబ్బందితో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. అబ్కారీ విభాగ బృందం సభ్యులు ఖతిగుడ పోలీసు స్టేషన్ పరిధి సవురాగుడ గ్రామం సమీప కొండ వాగు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. నాటు సారా వంటకానికి సిద్ధం చేసిన 2,400 లీటర్ల ఇప్ప ఊట, 750 లీటర్ల నాటు సారా పట్టుకొని వాటిని ధ్వంసం చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే తెంతులికుంటి పోలీసుస్టేషన్ పరిధిలో కొహియిగుడ గ్రామానికి చెందిన మధు బిశాయి అనే వ్యక్తి వద్ద 21 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేశారు. దాడుల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్ త్రినాథ్ సౌర, మహిళ కానిస్టేబుల్ రంజీ జానీ, కానిస్టేబుల్ సుధాంశు శేఖర బాగ్, రంజిత్ సింహ, ఛతర గోండ్, అంశుమాన్ పారిడ ఉన్నారు.

అన్వేష హాస్టల్‌లో అక్రమాలు

- నలుగురు అసిస్టెంట్ సూపరింటెండెంట్ల సస్పెన్షన్
- ద్వితీచంద్ర సాహుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగింత
- కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఆదేశాలు



అన్వేష హాస్టల్ సముదాయం

రాయగడ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని పెట్టాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. అధికారుల విచారణలో నిజమని తేలడంతో నలుగురు అసిస్టెంట్ సూపరింటెండెంట్లపై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కొట్లాగుడ వద్ద అన్వేష హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివాసీ హరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశంతో నడుపుతున్న ఈ వసతి గృహంలో సుమారు వెయ్యిమంది విద్యార్థులు ఉంటున్నారు. పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇంగ్లిష్ మాధ్యమంలో చదువుకుంటూనే ఇక్కడ ఉండేవారు. మొత్తం నాలుగు వార్డుల్లో నివాసం ఉండే వీరందరికీ ప్రభుత్వం అందించే ఆహారం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వచ్చాయి. దీంతో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భరత్ భూషణ బిశ్వాల్ ఐదు నెలల క్రితం అన్వేష హాస్టల్‌ను సందర్శించి దర్యాప్తు చేశారు. ప్రతీ బుధవారం విద్యార్థులకు చికెన్ కూరతో కూడిన ఆహారాన్ని అందించాల్సి ఉన్నప్పటికీ దానికి బదులుగా పన్నీరు కూరతో భోజనం పెట్టినట్టు అధికారుల విచారణలో తేలింది. అలాగే నాణ్యమైన ఆహారాన్ని అందివ్వడం లేదని సంక్షేమ శాఖ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ చర్యలకు ఉపక్రమించారు. నలుగురు అసిస్టెంట్ సూపరింటెండెంట్లను సస్పెండ్ చేస్తూ గురువారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి బాధ్యతలను ఉపాధ్యాయుడు ద్వితీ చంద్ర సాహుకు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో హాస్టల్ ఒకటి, రెండు, మూడు, నాలుగు వార్డులకు చెందిన అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రమాకాంత పట్నాయక్, గౌరీశంకర్ పిడిక, అరుంధతి పండ, ఎం.శివప్రసాదరావు ఉన్నారు.

క్లుప్తంగా

రైల్వేజోన్ జట్టుకు హరీష్ ఎంపిక


హరీష్

హిరమండలం : రైల్వేజోన్ క్రికెట్ జట్టుకు హిరమండలం మండలంలోని గొట్టా గ్రామానికి చెందిన బత్తుల హరీష్ ఎంపికయ్యాడు. ప్రాథమిక స్థాయి నుంచి హరీష్ కు క్రికెట్ అంటే మక్కువ. ఇటీవల ఫస్ట్ యాక్షన్ టీ20 క్రికెట్ మ్యాచ్‌లకు కూడా ఎంపికై రాణించాడు. ఈ సందర్భంగా హరీష్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఇసుక లారీ బోల్తా


జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఇసుక లారీ బోల్తా పడింది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళుతుండగా అదుపు తప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. హైవే సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి, ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేటలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో పొలం వద్ద నాగరాజు అనే వ్యక్తిపై శుక్రవారం దాడి జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు తల్లి, కుమారుడు చుక్క అసిరితల్లి, రమేష్‌లపై ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. క్షతగాత్రుడు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు.

1600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కాశీబుగ్గ: శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గంగాధరం ఆదేశాల మేరకు సోంపేట ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, పలాస టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి మందస మండలం కరియాపల్లిలో శుక్రవారం సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

కాశీబుగ్గలో భారీ చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ రోటరీనగర్‌లో గురువారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇంట్లో చొరబడి డైమండ్స్‌తో కూడిన 40 తులాల బంగారు నెక్లెస్‌ను దోచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డు రోటరీనగర్‌లో నివాసముంటున్న చాప అలివేలు వజ్రపుకొత్తూరు మండలం ఎంఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. గురువారం విధులు ముగించుకుని తన స్వగ్రామమైన నందిగాం మండలం హరిదాసుపురం చేరుకుని అక్కడే రాత్రి బస వేసింది. ఇదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు రోటరీనగర్‌లోని ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. రెండు అలమరాలతో పాటు, బీరువాను పగులు కొట్టి అందులో ఉన్న ఆభరణాలు, నగదు దోచుకుపోయారు. అందులో రూ.17లక్షల విలువైన డైమెండ్‌తో కూడిన 40 తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులు, రూ.18వేల నగదు ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. చోరీ జరిగిన సొత్తు విలువ రూ.45 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. కుమార్తె పెళ్లి కోసం కష్టపడి దాచుకున్న సొత్తు దొంగల పాలైందంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఈమె భర్త సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ప్రస్తుతం ఎన్నికల విధులలో ఉన్నారని, కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు, క్రైం హెచ్‌సీ శ్రీనివాసరావు, క్లూస్‌టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కోటబొమ్మాళి: శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ హెచ్చరించారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామంలో శాంతిభద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున గ్రామస్తులు సామరస్యంగా మెలగాలని, ఎటువంటి తగాదాలు పెట్టుకోవద్దని హితవుపలికారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ గొడవలకు దిగితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.లచ్చపాత్రుడు, ఎంపీడీఓ వై.పద్మజ, ఈఓపీఆర్డీ బి.రామారావు, సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు


బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ రాజేంద్రకుమార్ పాత్రో

జయపురం: బుద్ధజయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కొరాపుట్ జిల్లా సునాబెడ మున్సిపాలిటీతోపాటు నందపూర్ సమితిలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. సునాబెడ మున్సిపాలిటీ 20వ వార్డులో సెమిలిగుడ-నందపూర్ మార్గంలో సరస్వతి శిశువాటిక సమీపంలో బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రకుమార్ పాత్రో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా బుద్ధ భగవానుడికి ధూప, దీప, ఫల, పుష్పాలతో పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. బౌద్ధ మతాన్ని స్థాపించి శాంతి, కరుణ, జ్ఞానమార్గాన్ని బుద్ధుడు ప్రబోధించారని గుర్తు చేశారు. విద్యార్థులు బుద్ధుని మార్గంలో పయనించాలన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ ప్రజ్ఞామయి నాయిక్, కౌన్సిలర్లు శంకర బిలాయి పాడియ, రవీంద్రకుమార్ ప్రధాన్, మనోజ్ సున, రామ బెనియ, బుద్ర అలంపాడియ, మమతా రాయ్, సురేంద్ర సెట్టి పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి దొరాగుడ గ్రామంలో కూడా వేడుకలు జరిగాయి. బుద్ధ జయంతి సందర్భంగా ఆదివాసీ నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా పుకాలీ, ఖినబరు, రంగినిగుడ, ఉమయిగంది, నందక గ్రామస్తులతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాలూరు, విశాఖ జిల్లా అరుకు ప్రాంతాల నుంచి ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు. రంగినిగుడ, ఉమయిగంది, దొరాగుడ గ్రామాల ప్రజలు సంయుక్తంగా లక్ష్మణ ఖింజయి అధ్యక్షతన బుద్ధ జయంతిని నిర్వహించారు. బుద్ధ పూర్ణిమ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసాయం చేసినట్టు నిర్వాహకులు వెల్లడించారు.


దొరాగుడ వేడుకలో గ్రామస్తులు

సంక్షేమ పథకాలపై మహిళలకు శిక్షణ


శిక్షణ శిబిరంలో పాల్గొన్న మహిళలు

జయపురం: జయపురం చైల్డ్ ఫండ్ విభాగం ద్వారా లీడ్ మదర్ మహిళలకు స్థానిక పంచాయతీ సమితి కార్యాలయ సభాగృహంలో శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. తల్లీబిడ్డల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ, వివిధ ప్రభుత్వ పథకాలు అమలు చేయటంపై అవగాహన కల్పించారు. పంచాయతీల పరిధిలో పని చేస్తున్న సిబ్బంది మహిళలకు మంచిజరిగేలా పని చేయాలని అధికారులు వివరించారు. గొడొపాదర్, టంకువ, రొండాపల్లి, బరిణిపుట్ గ్రామ పంచాయతీల నుంచి 20 మంది లీడ్ మా మహిళలు శిక్షణలో పాల్గొన్నారు. శిశువులు, కిశోరీల ఆరోగ్యం, ప్రభుత్వ చేపట్టిన పథకాలపై శిక్షణ ఇచ్చామని నిర్వాహకులు తెలిపారు. రామణగుడ కమ్యూనిటీ వైద్య కేంద్రాధికారి డాక్టర్ సుధాకర బిశాయి లీడ్ మదర్ మహిళలకు శిక్షణ ఇచ్చారు. చైల్డ్ ఫండ్ విభాగ కోఆర్డినేటర్ పూర్ణిమా దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభినాశ్ సిన్హ, ప్రమీళ నాయక్, సీతామణి హంతాల్, మధుశ్మిత నాయక్, గౌరీ చరణ్ హంతాల్ పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా లీడ్ మా మహిళలకు తమ విధులపై మరింత అవగాహన ఏర్పడుతుందని కోఆర్డినేటర్ పూర్ణిమ దాస్ అన్నారు.

బావిలో పడిన వృద్ధుడు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయంలోని బహిరంగ బావిలో మంగళవారం రాత్రి పడిపోయిన వృద్ధ భక్తుడు అదృష్టవశాత్తు రక్షించబడ్డాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 65 ఏళ్ల ధ్రువ చక్రవర్తిగా గుర్తించబడిన వృద్ధ భక్తుడు అతని భార్యతో కలిసి స్వామివారి దర్శనం కోసం విచ్చేశాడు. గురువారం ఆలయానికి వెళ్లి సాయంత్రం రత్న వేదికపై కొలువు దీరిన మూల విరాటుల్ని దంపతులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో తిరుగాడుతూ ఆనంద బజార్‌కు వెళ్లి మహా ప్రసాదం స్వీకరించారు. వారు నీరు కోసం ఆలయ ఉత్తర ద్వారం సమీపంలో ఉన్న బావి వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు ధృవ చక్రవర్తి జారి బావిలో పడిపోయాడు. దీంతో అతని భార్య సాయం కోసం కేకలు వేయడంతో సేవకులు సంఘటనా స్థలానికి చేరుకుని సింహద్వారం ఠాణా పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసు బృందం బావి వద్దకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు గంటపాటు సహాయక చర్యలు చేపట్టి 70 అడుగుల లోతున్న బావిలో నుంచి ధ్రువను ప్రాణాలతో అగ్నిమాపక సిబ్బంది బయటకు తీశారు. అతనికి ఎలాంటి గాయాలు కానప్పటికీ వైద్యుల సంప్రదింపుల కోసం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. ఈ దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆలయ నిర్వాహకులు విచారణ జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


జీడి చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామారావు

వజ్రపుకొత్తూరు: మండలంలోని అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జీడితోటల్లో శుక్రవారం గొర్లె ఉమామహేశ్వరరావు(26) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్. రామారావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడున్న ఐడీకార్డు ఆధారంగా మృతుడు విశాఖపట్నంలోని నావల్ డాక్‌యార్డులో లేబర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఆనవాళ్లను బట్టి గురువారం రాత్రి ఉరి వేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. గుర్తింపు కార్డు తప్ప మరెలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో వివరాల కోసం నావల్ డాక్‌యార్డును సంప్రదిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడు ఎరుపు చారలతో ఉన్న తెలుపు టీ షర్టు, నలుపు షార్టు(నిక్కర్)ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని, వివరాలను తెలిసిన వారు వజ్రపుకొత్తూరు పోలీసులను సంప్రదించాలని కోరారు. వీఆర్ఓ రెయ్యిమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుశాలపురంలో గ్రామదేవత ఉత్సవాల సందడి


సతివాడ పోలమ్మ తల్లి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుశాలపురంలో గ్రామదేవత సతివాడ పోలమ్మ తల్లి ఉత్సవాల సందడి నెలకొంది. 15 ఏళ్ల తర్వాత ఈ పండగలు జరుగుతున్నాయి. ఈ నెల 1 నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా ఈ నెల 28తో ముగియనున్నాయి. బంధుమిత్రులతో గ్రామం సందడిగా మారింది.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు


సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తజనం

భువనేశ్వర్: మహా వైశాఖి పురస్కరించుకుని గురువారం ఖుర్దారోడ్ ట్రాఫిక్ కాలనీ రామ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వైశాఖ మాసం సంపూర్ణ శక్తి ఈ పూర్ణిమ తిథిలో దాగి ఉన్నందున ఈ రోజున చేసిన సత్యనారాయణ వ్రతం పూర్ణ ఫలితాలు ప్రసాదిస్తుందని ప్రధాన అర్చకుడు పంతుల రఘునాథ శాస్త్రి తెలిపారు. సామూహికంగా నిర్వహించిన ఈ వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాలుపంచుకున్నారు. ఈ ఏడాది తరచూ ఇటువంటి ఆధ్యాత్మిక, ధార్మిక, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామ మందిరం భక్త సమాజం వర్గం తెలిపింది.

క్షీర సాగర మథనం నిర్విఘ్నంగా పూర్తి కావడానికి శ్రీమహావిష్ణువు కూర్మరూపంలో అవతరించగా.. ఆ రూపాన్ని మరెక్కడా లేని తీరులో మూలవిరాట్టుగా ప్రతిష్ఠించి అర్చిస్తున్న విశిష్టత మన జిల్లాలో గోచరిస్తుంది. ఆధ్యాత్మిక భావానికి పరాకాష్టగా కూర్మనాథుడి ఆరాధనను చెప్పుకుంటే.. ఈ కాలంలో అందుకు ఏమాత్రం తీసిపోని మరో మానవీయ సేవ తీరప్రాంతంలో నిర్విఘ్నంగా సాగిపోతోంది. అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతతిని పరిరక్షించడానికి.. వాటి గుడ్లను సేకరించి.. ప్రత్యేకించి పొదిగించి.. మళ్లీ సముద్రంలో లక్షలాది చిరుజీవులను విడిచిపెట్టే గొప్ప ప్రయత్నం నిరతం సాగుతోంది. అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ చేస్తున్న ఈ మంచి ప్రయత్నం సముద్రం చేయూతతో ప్రశంసనీయ రీతిలో నడుస్తోంది.

ఒక్కో తాబేలు పెట్టే గుడ్ల సంఖ్య: 30 నుంచి 140

పొదిగే కాలం: 45 నుంచి 70 రోజులు

28 నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద పొదిగిన పిల్లలు మగ తాబేళ్లుగా,

30-32 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద పొదిగిన పిల్లలు ఆడ తాబేళ్లుగా పరిగణిస్తారు.

ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సేకరించిన గుడ్లు: 1,59,275

ఇప్పటి వరకు సాగరంలోకి విడిచిపెట్టిన తాబేళ్లు: 95,696

జిల్లా వ్యాప్తంగా తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు: 16

సంరక్షణకు పనిచేస్తున్న వలంటీర్లు: 41



కడలి మమకారం.. మనిషి సహకారం.. వెరసి కూర్మావతారం

- అద్భుత ప్రయాణం.. ఆలివ్ రిడ్లే తాబేళ్ల ప్రస్థానం
- జిల్లాలో 16 హ్యాచరీలతో అరుదైన జాతి సంరక్షణకు యత్నం
- 1,59,275 గుడ్లు సేకరణ.. సాగరంలోకి 95,696 చిట్టి తాబేళ్లు

వజ్రపుకొత్తూరు రూరల్:

సముద్ర జీవుల్లో అరుదైన ఉభయచర జీవులు ఆలివ్ రిడ్లే తాబేళ్లు. ఇవి పసిఫిక్ మహాసముద్రం నుంచి హిందూ మహాసముద్రం వరకు కనిపిస్తూ ఉంటాయి. జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెనిజూలా, గల్ఫ్ తదితర 80 దేశాలతో పాటు మనకు వేల నాటికల్ మైళ్ల దూరంలో గంగమ్మ ఒడిలో ఒదిగి ఉంటున్నాయి. తమ సంతతిని వృద్ధి పరిచే లక్ష్యంతో తీరానికి లక్షల సంఖ్యలో చేరుకుంటాయి. మాతృత్వాన్ని పొందేందుకు ప్రకృతిని(తీరాన్ని) ఆవాసాలుగా మార్చుకుంటాయి. అలాంటి ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతతికి శ్రీకాకుళం జిల్లా సముద్ర తీరం పుట్టినిళ్లుగా నిలుస్తోంది.

భద్రంగా కాపాడుతూ..

జిల్లాలో 193 కి.మీ. విశాల సముద్ర తీరం ఉండటంతో ఆలివ్ రిడ్లే తాబేళ్లు తమ సంతతి సంరక్షణకు నిలయంగా మార్చుకుంటున్నాయి. వీటికి అటవీ అధికారులు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు రక్షణగా నిలుస్తున్నారు. జిల్లాలో 16 సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి జీవం పోస్తున్నారు. 41 మంది వలంటీర్లను నియమించి వారి ద్వారా గుడ్లు సేకరిస్తున్నారు. తల్లి తాబేళ్లు ఇసుక తిన్నెలలో పెట్టిన గుడ్లు పక్షులు, జంతువులు, దొంగల బారిన పడకుండా భద్రపరుస్తున్నారు. తీరంలో ఏర్పాటు చేసిన హేచరీలలో గుడ్లను పొదిగించి బుల్లి తాబేళ్లను సురక్షితంగా సముద్రంలో విడిచిపెడుతున్నారు.


సముద్రంలోకి వెళ్తున్న బుల్లి తాబేళ్లు

సంరక్షణ కేంద్రాలు ఎక్కడెక్కడ..

- జిల్లా వ్యాప్తంగా 16 హ్యాచరీలు(తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు)ఉన్నాయి.

వజ్రపుకొత్తూరు సెక్షన్: వజ్రపుకొత్తూరు, మెట్టూరు

- **బారువ సెక్షన్:** కళింగపట్నం, గడ్డివూరు, బట్టిగల్లూరు, బారువ, ఇసుకవానిపాలెం
- **కవిటి సెక్షన్:** డొంకూరు, చేపల కపాసుకుద్ది, బట్టివానిపాలెం
- **శ్రీకాకుళం సెక్షన్:** కొచ్చెర్ల, గంగులవానిపేట
- **టెక్కలి సెక్షన్:** గుల్లవానిపేట, కుముందివానిపేట, మేఘవరం, భావనపాడు


వజ్రపుకొత్తూరులో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రం

పక్కాగా సంరక్షణ



తీరంలో తాబేళ్లు పొదిగిన గుడ్లను ఎలుగులు, నక్కలు, పక్షులు తినకుండా ట్రీ ఫౌండేషన్, యువకులు, మత్స్యకారుల సహకారంతో సంరక్షిస్తున్నాం. అరుదైన తాబేళ్ల జాతిని కాపాడుతున్నాం. ఇప్పటికే వేల సంఖ్యలో బుల్లి తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టాం.

– మురళీకృష్ణనాయుడు, అటవీ శాఖాధికారి, కాశీబుగ్గ రేంజ్

రాత్రివేళల్లో గుడ్లు సేకరణ..

- ఏటా జనవరి నుంచి మార్చి వరకు తల్లి తాబేళ్ల గుడ్లు పెడుతుంటాయి.
- ఈ సమయంలో రాత్రి 10 నుంచి వేకువజాము 5 గంటల్లోపు తీరానికి చేరుకుంటాయి.
- ఈ సమయంలోనే ఇసుక తిన్నెలలో బొరియలు చేసి గుడ్లును పెట్టి సముద్రంలోకి తిరిగి వెళ్లిపోతాయి.
- వలంటీర్లు రాత్రి సమయంలోనే టార్చిలైట్, సంచులు పట్టుకుని తీరంలో తిరుగుతూ గుడ్లు సేకరిస్తారు.
- వాటిని సంరక్షణ కేంద్రంలో అధికారుల సమక్షంలో భద్రపరుస్తారు.

ఉద్యమంలా సేకరణ..

పాతికేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తమిళనాడు ఇతర రాష్ట్రాలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల గుడ్ల సేకరణ ఉద్యమంగా సాగుతోంది. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువకులు, మత్స్యకారుల సాకారంతో లక్షలాది గుడ్లను హ్యాచరీలలో సంరక్షించి పొదిగిన తర్వాత బుల్లి తాబేళ్లను తిరిగి సముద్రంలో విడిచిపెడుతున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా తాబేలు గుడ్ల సేకరణ యజ్ఞంలా సాగింది.


తాబేళ్ల గుడ్లను సేకరిస్తున్న వలంటీర్లు


బుల్లి తాబేళ్లలను సముద్రంలోకి వదులుతున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అరుదైన జాతిని కాపాడుకుందాం



సముద్ర జీవులలో అరుదైన ఆలివ్‌రిడ్లే తాబేళ్ల రక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. రాత్రి వేళల్లో తీరం వెంబడి తిరుగుతూ వలంటీర్ల సహకారంతో గుడ్లను సేకరించి సంరక్షిస్తున్నాం. పొదిగిన బుల్లి తాబేళ్లను అటవీ శాఖా అధికారులు సహాయంతో మళ్లీ సముద్రంలోకి విడిచిపెడుతున్నాం.

– కె.సోమేశ్వరరావు, ట్రీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్

క్లుప్తంగా

రైలు పట్టాలపై నిలిచిపోయిన లారీ



పట్టాల మధ్యలో నిలిచిన లారీ

గజపతినగరం: మండల కేంద్రంలోని పురిటి పెంట రైల్వేగేట్ మధ్యలో భారీ లారీ నిలిచిపోయిన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గజపతినగరం నుంచి మెంటాడ వైపు గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సరుకు తీసుకు వస్తున్న లారీ పురిటిపెంట రైల్వే పట్టాలపై నిలిచిపోయింది. లారీ కింద భాగాలు విరిగిపోయి పట్టాలకు తగలడంతో ముందుకు వెళ్లలేకపోయింది. వెంటనే రైల్వే అధికారులు, గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్లు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీతో లారీని తరలించారు. దీంతో ఉదయం నాలుగు గంటల నుంచి ఏడు వరకు రాయగడ వైపు వెళ్లాల్సిన రైళ్లను నిలిపివేశారు.

చోరీ కేసులో నిందితురాలి అరెస్ట్

బాడంగి: వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ చేసిన నిందితురాలిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సంఘటనకు సంబంధించి ఎస్సై ఆర్. జయంతి తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముగడ గ్రామానికి చెందిన మత్స అచ్చియ్యమ్మ అనే వృద్ధురాలికి వద్దకు మాజీ వలంటీర్ యామల స్వాతి గురువారం ఉదయం 9 గంటల సమయంలో వచ్చింది. పింఛన్ కోసం ఐరిస్ చేయాలని చెప్పి వృద్ధురాలిని నమ్మించి మెడలో ఉన్న పుస్తెలతాడు అపహరించింది. దీంతో వృద్ధురాలు విషయాన్ని తన కుమారుడు రామారావుకు చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేసి బొబ్బిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మెంటాడ: మండలంలోని చింతలవలస మామిడితోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం కనుగొన్నారు. విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ కొండమ్మ, ఆంధ్ర పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై దేవి మాట్లాడుతూ, మృతుడు సమీప ప్రాంతాల్లో యాచక వృత్తి చేసుకుంటున్న వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. నీలం రంగు షర్ట్, 5.6 అడుగుల ఎత్తు, నలుపు, తెలుపు రంగు జుత్తు కలిగి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



పల్లకిలో ఉన్న సీతారామచంద్రస్వామికి పూజలు జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జరభద్రం..

- ప్రారంభమైన వ్యాధుల వ్యాప్తి
- 67,344 జ్వరాల కేసులు నమోదు
- 120 మలేరియా కేసులు, 41 డెంగీ కేసులు కూడా..



నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

విజయనగరం ఫోర్ట్: సీజనల్ వ్యాధుల వ్యాప్తి ప్రారంభమైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడ్డారు. వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగి కేసులు జిల్లాలో నమోదయ్యాయి. వైరల్ జ్వర పీడితులైతే వేలల్లో ఉండడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ వ్యాధి నిర్ధారణ మాత్రం విజయనగరంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, రాజం ఏరియా ఆస్పత్రుల్లో చేస్తున్నారు. వేసవి కాలం ముగియనున్న సమయంలో వ్యాధుల వ్యాప్తి అధికమయ్యే అవకాశం ఉంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు ముందుస్తు నివారణ చర్యలు చేపడుతున్నారు. ప్రజలు కూడా వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

67, 344 జ్వరాల కేసులు..

జిల్లాలో జనవరి నెల నుంచి మార్చి నెలఖారు నాటికి 67, 344 జ్వరాల కేసులు నమోదయ్యాయి. 820 మందికి డెంగీ పరీక్షలు నిర్వహించగా అందులో 41 మందికి డెంగీ నిర్ధారణ అయింది. 67, 344 మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా అందులో 120 మలేరియా పాజిటివ్ వచ్చింది.

మలేరియా..

తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా లక్షణాలు. మలేరియా జ్వరం తగ్గిన తర్వాత మళ్లీ వస్తుంది. జ్వరం తగ్గిపోయిన తర్వాత మళ్లి వచ్చినట్టు అయితే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. మలేరియా వ్యాధి ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల వస్తుంది. దోమ కాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా జెరమ్స్ శరీరంలోకి వెళ్తాయి. 14 రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది. ఈ దోమ నిల్వ ఉన్న వర్షపు నీటిలో వృద్ధి చెందుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

మలేరియా నివారించడానికి దోమ తెరలు వినియోగించుకోవాలి. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉంటే కిరోసిన్ గాని పురుగు మందుగాని పిచికారీ చేయాలి.

డెంగీ..

జ్వరంతో పాటు తీవ్ర తలనొప్పి, ఒళ్లు నొప్పులుంటాయి. ఒక్కోసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం కలగడం వల్ల కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదర భాగాల చర్మంపై ఎర్రగా కందినట్టు చిన్న చిన్న మొటిమలు కనిపిస్తాయి. ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది. ఈడిస్ ఈజిప్ట అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ పగటి పూట కుడుతుంది. దోమ కుట్టినప్పుడు ఒళ్లంతా దద్దర్లు కనిపిస్తాయి. ఇళ్లల్లోని కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, ఎయిర్ కూలర్లు, ఇళ్ల పరిసరాల్లో నిర్లక్ష్యంగా పడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కుప్పలు, పగిలిన సీసాలు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షపు నీటిలో గుడ్లు పెట్టి దోమ పెరుగుతుంది.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మహిళకు రక్తన మూనా తీస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఇంటి పరసర ప్రాంతాల్లో వృథా నీటిని నిల్వ ఉంచరాదు. పెంట కుప్పలు, ఇంట్లో వచ్చే చెత్తాచెదారం ఇంటికి దూరంగా వేయాలి. ఇళ్లలో ఉన్న అన్ని గదుల్లో దోమల మందు పిచికారీ చేయించాలి. దోమ తెరలు వాడటం లేదా ఇంటి కిటికీలు, తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. నీరు నిల్వ చేసే పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి మరలా నింపు కోవాలి.

అప్రమత్తంగా ఉన్నాం..

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నాం. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. జ్వర పీడితుల వద్ద శాంపిల్స్ తీసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం.

ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

కంటెయినర్ ఢీకొని వివాహిత దుర్మరణం

- కుమార్తె కాలేజీ ఫీజు చెల్లించడానికి వచ్చి మృత్యువాత



బైక్‌ను ఢీకొట్టిన కంటెయినర్

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయరహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా ఎల్.కోటకు చెందిన సావర్ల నవ్య అనే వివాహిత మృతి చెందింది. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్దిపాలెం నారాయణ కళాశాలలో నవ్య కుమార్తె ఝాన్సీ చదువుతోంది. కుమార్తె ఫీజు చెల్లించడానికి గానూ కుమారుడు రాజు, కుమార్తెతో కలిసి ఆమె ద్విచక్రవాహనంపై పెద్దిపాలెం వస్తోంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి రాంచీ వెళుతున్న చాక్లెట్ల కంటెయినర్ గోకార్టింగ్ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవ్య అక్కడికక్కడే మృతి చెందగా.. రాజు, ఝాన్సీ గాయపడ్డారు. ఆనందపురం ట్రాఫిక్ ఎస్‌ఐ సునీల్ ఫిర్యాదుతో సీఐ టి.తిరుపతిరావు కేసు నమోదు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



వినయవర్ధన్ మృతదేహం

బొబ్బిలి: రోడ్డు ప్రమాదంలో ఆరో తరగతి చదువుతున్న బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్సై జి. భాస్కరరావు తెలియజేసిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన పెంకి వినయవర్ధన్(13), కేరళలో ఇంజినీరింగ్ చదువుతున్న మెరకముడిదాం మండలం గర్భాం గ్రామానికి చెందిన వెమ్మల పవన్ బొబ్బిలి మండలం కారాడలో జరుగుతున్న బంధువుల వివాహానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో వీరివురూ బొబ్బిలి వైపు బైక్‌పై వెళ్తుండగా అలజంగి చెరువు మలుపు వద్ద బైక్ అదుపు తప్పి పడిపోవడంతో ఇద్దరూ కిందపడిపోయారు. బైక్‌పై వెనుక కూర్చున్న వినయ వర్ధన్ తలకు బలమైన గాయాలు కాగా.. పవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి ఇద్దరినీ బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. వినయవర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వినయ్‌వర్ధన్ తల్లిదండ్రులు శ్రీనివాసరావు, రత్నాలమ్మ వ్యవసాయ కూలీలు కాగా వీరికి ఇద్దరు పిల్లలు. వినయ్ వర్ధన్‌కు అక్క ఉన్నట్టు బంధువులు తెలిపారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై భాస్కరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు..



తామాడ అఖిల్ (ఫైల్)

గజపతినగరం రూరల్: మండలంలోని గంగచోళ్లపెంటకు చెందిన తామాడ అఖిల్ (9) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నాటుబండి నుంచి కిందకు పడిపోవడంతో అఖిల్‌కు తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. వెంటనే కుటుంబ సభ్యులు విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టపగలే చోరీ

- ఆందోళనలో ప్రజలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి ప్రాజెక్ట్ బోటు షికారు పరిసరాలలో కొంతమంది దుండగులు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. దళాయివలసకు చెందిన ఎస్.నారాయణరావు ఖడ్గవలస వైపు శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ సమయంలో నలుగురు వ్యక్తులు ఒక్కసారిగా వచ్చి నారాయణరావు ద్విచక్ర వాహనం ఆపి ఆయన మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు దోచుకుని పారిపోయారు. వెంటనే నారాయణరావు గట్టిగా కేకలు వేసినా పరిసరాల్లో ఎవ్వరూ లేకపోవడంతో దొంగలు పరారయ్యారు. ఈ ప్రాంతంలో గతంలో కూడా పలుమార్లు దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

పోగొట్టుకున్న సెల్ అందజేత



టూటౌన్ ఏఎస్సై పైడితల్లి ఆధ్వర్యంలో ధీరజ్‌కుమార్‌కు ఐ ఫోన్ అప్పగిస్తున్న జయరామ్, తదితరులు

విజయనగరం క్రైమ్: వయోజన విద్యాశాఖలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గెద్ద జయరామ్, అతని సోదరి హేమలత (ఉపాధ్యాయురాలు) శుక్రవారం ఉదయం పట్టణంలోని రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. సుమారు లక్ష రూపాయల విలువ చేసే ఐ ఫోన్ దొరికింది. ఇంతలో సెల్‌ఫోన్ పొగొట్టుకున్న బాధితుడు ధీరజ్‌కుమార్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫోన్ దొరికిన తర్వాత అందులో ఉన్న నంబర్లకు ఫోన్ చేయగా.. బాధితుడు టూటౌన్‌లో ఉన్నట్లు తెలుసుకున్న జయరామ్, అతని సోదరి హేమలత స్టేషన్‌కు వెళ్లి పోలీసుల సమక్షంలో ఫోన్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై పైడితల్లి, తదితరులున్నారు.

మద్యం సీసాలు ధ్వంసం

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 576 మద్యం బాటిళ్లను శుక్రవారం ధ్వంసం చేశారు. పార్వతీపురం ఏఎస్పీ సునీల్ షరైన్ సమక్షంలో మద్యం ధ్వంసం చేశామని పట్టణ సీఐ కృష్ణారావు చెప్పారు. మద్యం అక్రమంగా తరలించినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

అరగంట ముందే చేరుకోవాలి..



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ అనిత

- డీఆర్‌ఓ అనిత
- నేడు డిప్యూటీ డీఈఓ పోస్టుల భర్తీకి పరీక్ష

విజయనగరం అర్బన్ : ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈఓ పోస్టుల భర్తీకి శనివారం నిర్వహించనున్న ఆన్‌లైన్ పరీక్షకు అభ్యర్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత తెలిపారు. అభ్యర్థులను 7.30 నుంచి 8.30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రానికి అనుమతిస్తారన్నారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం ఆమె తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శనివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 1470 మంది హాజరు కానున్నారని తెలిపారు. జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రాజాంలో 300 మంది, ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, చింతలవలసలో 250 మంది, అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, భోగాపురం మండలంలో 170 మంది, బొబ్బిలిలోని స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాలలో 90 మంది, సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విజయనగరంలో 150 మంది, సీతం కాలేజీ, కొండకరకాంలో 510 మంది పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. రాజాం పరీక్ష కేంద్రానికి హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఉదయం 5.30, 6 గంటలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు ఒరిజినల్ ఫొటో గుర్తింపుకార్డు తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న తవిటినాయుడు

బొబ్బిలి: మండలంలోని కమ్మవలస గ్రామానికి చెందిన పాతినవలస తవిటినాయుడు (40) ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చదలవాడ సత్యనారాయణ చెప్పిన వివరాల ప్రకారం.. తవిటినాయుడు తన భార్య లక్ష్మిపై అనుమానం పెంచుకుని ఇనుపరాడ్‌తో కొట్టి ఇటీవల హత్య చేశాడు. పైగా దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడు. ఇదే సమయంలో విచారణ చేపట్టిన పోలీసులు హత్యగా తేల్చారు. నిందితుడైన తవిటినాయుడును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా... బెయిల్‌పై ఇటీవల బయటకు వచ్చాడు. అయితే హత్య కేసులో ఇరుక్కుపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తవిటినాయుడు ఊరి చివరలో ఉన్న చెట్టుకు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎం. నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- మూడు రోజుల ముందే ఏర్పాట్లు పూర్తి కావాలి
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- రెండు కేంద్రాల వద్దా పబ్లిక్ కమ్యూనికేషన్ సెంటర్లు
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. లెక్కింపు ప్రక్రియ కోసం చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఆయా శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఓట్ల లెక్కింపు సజావుగా, సకాలంలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. లెండి కళాశాలలో చీపురుపల్లి, గజపతినగరం, రాజాం, నెల్లిమర్ల, ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని.. జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. లెండి కళాశాల లెక్కింపు కేంద్రానికి మెప్మా పీడీ సుధాకరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు.. జేఎన్‌టీయూ కేంద్రానికి డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తారని తెలిపారు. లెండి కళాశాలలో ఆర్అండ్‌బీ, జేఎన్‌టీయూలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలు ఏర్పాట్లు చేస్తాయన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని.. మూడు రోజులు ముందుగానే లెక్కింపు గదుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆ రోజు ఉదయం 6 గంటలకే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకుంటారని.. వారికి అల్పాహారం, భోజన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. సిబ్బంది, ఏజెంట్లు వారికి కేటాయించిన కౌంటింగ్ హాళ్లకు సులువుగా చేరుకునే విధంగా సైన్ బోర్డులు, డైరెక్షన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, జెనరేటర్‌ను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. సిబ్బంది, ఏజెంట్లు లోపలికి వెళ్లి రావడానికి వీలుగా బారికేడ్లు, మెష్‌ల ద్వారా వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు చోట్లా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా, ఒక్కో అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. సిబ్బందికి, ఏజెంట్లకు వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలను నిర్ణయించాలని సూచించారు. ఏజెంట్లు నగదు చెల్లించి తీసుకొనే విధంగా భోజన కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. పాత్రికేయుల కోసం రెండు చోట్లా రెండు మీడియా సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, వివిధ విభాగాల నోడల్ అధికారులు, వేదికల ఇన్‌చార్జ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

కొరియర్ పేరుతో సైబర్ మోసాలు

- అప్రమత్తంగా ఉండాల్సిందే...
- ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: ఫెడెక్స్ కొరియర్ పేరతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్కరూ అప్రత్తంగా ఉండాల్సిందేనని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఇన్నాళ్లూ ఉద్యోగం, వ్యాపారం, చలానాలు, ఆఫర్లు అంటూ మోసం చేసేవారని, ఇప్పుడు కొరియర్ పేరిట కొత్త మోసాలకు తెరతీస్తున్నారన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ఓ న్యాయవాదికి ఫెడెక్స్ కొరియర్ సంస్థ నుంచి కాల్ చేస్తున్నాం... మీరు ముంబయి నుంచి థాయ్‌లాండ్‌కు పంపించిన పార్సిల్‌లో డ్రగ్స్‌తో పాటు ఇతర నిషేధిత వస్తువులు ఉన్నాయి.. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. కేసు నుంచి తప్పించాలంటే డబ్బులు ఇవ్వాలంటూ దాదాపు రూ.15 లక్షలు కాజేశారన్నారు. తమ సంస్థ పేరుతో జరుగుతున్న మోసాలపై ఫెడెక్స్ సైతం స్పందించిందన్నారు. ఫోన్‌కాల్స్ ద్వారా తాము ఎప్పుడూ వ్యక్తిగత సమాచారం కోరబోమని తెలిపిందన్నారు. ఎవరైనా వ్యక్తిగత సమాచారం కోరుతూ ఫోన్లు, మెసేజ్ చేస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇవి పాటించండి...

- అనుమానాస్పదంగా అనిపించే ఫోన్ కాల్స్‌కు రియాక్ట్ అవ్వొద్దు
- యూపీఐ పిన్, ఐడీ లాంటి సమాచారాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ షేర్ చేయొద్దు.
- అధికారిక ఫెడెక్స్ వెబ్‌సైట్లో మాత్రమే ప్యాకేజీ స్టేటస్‌ను చెక్ చేయాలి.
- సైబర్ నేరాలపై ఫిర్యాదు కొరకు 1930 నంబర్‌కు, లేదంటే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

తొలిరోజు ప్రశాంతం

- టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

విజయనగరం అర్బన్: పదోతరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పదోతరగతి తెలుగు పరీక్షకు 1,218 మందికి 489 మంది మాత్రమే హాజరైనట్టు డీఈఓ ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ సంప్లిమెంటరీ పరీక్షల్లో తొలిరోజు ఉదయం మొదటి సంవత్సర తెలుగు-1, సంస్కృతం-1, హిందీ-1, ఒకేషనల్-1 పరీక్షకు 3,542 మందికి 3,320 మంది హాజరయ్యారని ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సరం తెలుగు-2, సంస్కృతం-2, హిందీ-2, ఒకేషనల్-2 సబ్జెక్టు పరీక్షలకు 969కి 883 మంది హాజరయ్యారు.

సజావుగా డీఈఈ సెట్

జిల్లాలో శుక్రవారం నిర్వహించిన డీఈఈ సెట్-2024 ప్రవేశ పరీక్ష స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో జరిగే పరీక్షకు 256 మంది హాజరుకావాల్సి ఉండగా 228 మాత్రమే పరీక్ష రాసినట్టు డీఈఓ ఎస్.ప్రేమకుమార్ తెలిపారు.